వి జ్ఞానభాండాలు ప్రాచీన గ్రంథాలు. తమ కాలపు విశేషాలను భవిష్యత్ తరాలకు చేరవేయడానికి కిందటి తరాలవాళ్లు ఎన్నో రచనలు చేశారు. తాతలు అందించిన ఆ వారసత్వాన్ని అపురూపంగా చూసుకుంటూ తర్వాతి తరాలు కాపాడుకుంటూ వచ్చాయి. తాళపత్రం మూడు వందల ఏళ్లకు శిథిలమైపోతుంది. దానికంటే మెరుగైనది కాగితం. ఆ కాగితం రెండు, మూడింతలు ఎక్కువ కాలం ఉంటుంది. ఆ తర్వాత?.. ఇలా శిథిలమైపోతున్న జ్ఞాపకాలను పదిలం చేసుకునేందుకు వాటిని ఎత్తి రాస్తూ గతాన్ని వర్తమానానికి అందిస్తూ పోయాడు మనిషి. ఆ గతాన్ని రేపటి కోసం భద్రపరచడమే కాదు ఆ వారసత్వ రచనల్లోని విజ్ఞానాన్ని విశ్లేషించేందుకు పరిశోధనలూ చేస్తున్నారు. సీపీ బ్రౌన్ అందించిన వేమన పద్యాలు అలాంటివే. నేడు పుస్తక రూపంలో ఉన్న పురాణాలు, కావ్యాలు, నీతి శాస్త్రాలు, ఆధ్యాత్మిక చింతన, తత్వ, వైద్య, ఖగోళ, గణిత విషయాలెన్నో ఎత్తిరాస్తూ కాపాడుకుంటేనే మనకు దక్కాయి. ఎవరో ఒకరు పూని కాపాడిన వారసత్వ సంపదను రేపటి కోసం నిలుపుకొనేందుకు ఏర్పాటైనదే ప్రాచ్య లిఖిత గ్రంథాలయం. ఎన్నో రంగాలకు చెందిన వేల గ్రంథాలను సేకరించి, పరిష్కరించి, ప్రచురించి, సంరక్షిస్తున్నది 'తెలంగాణ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనాలయం'. స్వర్ణోత్సవాలు జరుపుకొంటున్న ఈ భాండాగారంలో బంగారం కన్నా విలువైన రాతప్రతులెన్నో ఉన్నాయి. వాటిలో ఎన్ని విశేషాలున్నాయో దీని స్థాపన, నిర్వహణ, లక్ష్యాల్లో అన్ని విశేషాలున్నాయి!


రసాయన లేపనంతో తాళపత్ర సంరక్షణ

## నిజాంల ముందుచూపు

ఆరో నిజాం మహబూబ్ ఆలీఖాన్ పాలనా కాలంలో ఆధునిక ఐరోపా తరహా పాలన, వ్యవస్థలు, సంస్థల ఏర్పాటు ప్రారంభమైంది. ఆ ప్రభావంతో ఆసఫియా లైబ్రరీ (నేటి స్టేట్ లైబ్రరీ) స్థాపించారు. ఈ గ్రంథాలయంలో నిజాంలు సేకరించిన రాతప్రతులను భద్రపరిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ తర్వాత 1 నవంబరు 1975న 'ఆంధ్రప్రదేశ్ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధన సంస్థ'ను ప్రభుత్వం నెలకొల్పింది. ఆసఫియా లైబ్రరీలో భద్రపరిచిన 20 వేల రాతప్రతులతోపాటు ఇతర ప్రాంతాల గ్రంథాలయాల నుంచి సేకరించిన మరికొన్ని రాతప్రతులతో ఈ సంస్థ ఏర్పాటైంది. ఈ గ్రంథాలయాన్ని కొన్నాళ్లకు స్టేట్ లైబ్రరీ నుంచి రాజ్యాభిలేఖ గ్రంథాలయం (తార్నాక)కు మార్చారు. రత్న బజార్ షాపింగ్ కాంప్లెక్స్ (అబిడ్స్)కు తరలించారు. పరిశోధనలకు అనువుగా ఉండేలా 1996లో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని శాశ్వత భవనానికి ఈ సంస్థ మారింది. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనా సంస్థ' పేరుతో ఏర్పాటైన ఈ సంస్థ రాష్ట్ర విభజన తర్వాత 'తెలంగాణ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనా సంస్థ'గా ఏర్పడింది.

ప్రాచ్యం అంటే ప్రాచీనం అని అర్థం. ప్రాచ్య లిఖితం అంటే ప్రాచీన కాలానికి సంబంధించిన అరుదైన లిఖిత ప్రతులు అని అర్థం. కనీసం 75 సంవత్సరాల పాతవై ఉండాలి. వాటికి సామాజిక ప్రయోజనం ఉండాలి. ఈ ప్రమాణాల ఆధారంగా చేసుకుని అరుదైన రాత ప్రతులను ఈ సంస్థ పరిరక్షిస్తున్నది. 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధన సంస్థ'లో 47 అంశాలకు సంబంధించిన 24 వేల రాతప్రతులను భద్రపరిచారు. 16 భాషల్లో ఉన్న ఈ ప్రాచ్య లిఖిత గ్రంథాల్లో తాళపత్ర గ్రంథాలు, కాగితంపై లిఖించినవే కాకుండా తోలుపై చేసిన రచనలూ ఉన్నాయి! ఈ గ్రంథాలయంలో 17 వేల గ్రంథాలు ఉర్దూ, అరబిక్, పారశీక భాషల్లో ఉన్నాయి. 7 వేల గ్రంథాలు సంస్కృతం, తెలుగు, కన్నడ, మరాఠీ భాషలకు చెందినవి.


ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం

## బ్రిటిష్ భారతం

భారతీయ విద్యా విధానంలో చారిత్రక విషయాలకు ప్రాధాన్యత లేకపోవడం వల్ల ప్రాచ్య లిఖిత గ్రంథాల అవసరం చాలామందికి తెలియదు. భారతదేశానికి బ్రిటిష్ వారు వచ్చిన తర్వాత మనదేశంలోని తాళపత్రాలు, పురాతన రాతప్రతులపై దృష్టిసారించారు. నేడు మనం చదువుతున్న వాల్మీకి రామాయణం, మహాభారతాలు, మరెన్నో పురాణాలను బ్రిటిష్ పరిశోధకులు సేకరించి, పరిశీలించి, ప్రచురించినవే. మనదేశంలో అనేక రకాల రామాయణ కావ్యాలు ప్రచారంలో ఉండేవి. రకరకాల రామాయణాల్లోంచి వాల్మీకి రామాయణాన్ని ప్రామాణీకరించడం కోసం రామాయణ తాళపత్రాలెన్నిటినో పరిశీలించారు. ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్న 'మహాభారతం' రూపొందించడం కోసం బ్రిటిష్ పాలకులు 1200 రాతప్రతులను సేకరించి, ఎత్తిరాయించారు. 'తాళపత్రాలు వేల సంవత్సరాలపాటు మనలేవు. కాబట్టి ప్రాచీన సాహిత్యాన్ని కాపాడుకునేందుకు ఎత్తి రాస్తూ ఉండేవాళ్లు. అలా రాసే క్రమంలో కొన్ని శ్లోకాలను మూల సాహిత్యానికి చేర్చేవారు. ఇలాంటి మార్పులు జరిగిన వాటిని గుర్తించి, మూల రచన ఏదో తేల్చేందుకు సేకరించిన రాతప్రతులను పోల్చారు. అందుకోసం అన్ని తాళపత్రాలనూ ఎత్తి రాయించారు. వాటిల్లో ఏ పదాలు తప్పుగా చేరాయి. ఏ పదాలు సరైనవో గుర్తించి.. పరిష్కరించారు. అలా మూల మహాభారత కథను ప్రచురిం

### ముఖ్తసర్ - అల్ - కఫి



కాలాన్ని బట్టి తప్పొప్పులు మారిపోతూ ఉంటాయి. ఒకనాటికి తప్పు కానిది ఈనాటికి తప్పు కావొచ్చు. ఒకనాడు ఒప్పుగా చెలామణీ అయినది నేడు తప్పుగా శిక్షార్హమవ్వొచ్చు. ఇలాంటి విశేషాలు తెలుసుకోవాలంటే ప్రాచీన గ్రంథాల్లోని న్యాయశాస్త్రాలను తిరగేస్తే తెలుస్తుంది. ఆనాటి న్యాయాన్యాయాల గురించి వివరించే సంస్కృత, పారశీక, తెలుగు రాతప్రతులు ఈ పరిశోధనాలయంలో ఉన్నాయి. వాటిలో ఒకటి 'ముఖ్తసర్–అల్–కఫి'. ఇది అయిదో శతాబ్దం నాటి న్యాయశాస్త్రాన్ని వివరిస్తుంది. క్రీ. శ. 1026లో ప్రాచీన అరబ్బీ, నష్క లిపిలో ముగ్గురు పండితులు ఈ గ్రంథాన్ని ప్రతిలేఖనం చేశారు.